ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పత్తి కొనుగోలు నిలిపివేత

జైనూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెండె జిన్నింగ్ మిల్లులలో పత్తి నిల్వలు అధికమైనందున పత్తి కొనుగోలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఈర్ఫాన్ అహ్మద్, సీపీవో నరేష్ సోమవారం తెలిపారు. తిరిగి పత్తి కొనుగోలు తదుపరి సమాచారం తెలియపరుస్తామని, రైతులు సహకరించాలని వారు కోరారు.

ఓటర్ల జాబితా విడుదల

జైనూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎలక్షన్ కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీటీసీల స్థానాల వారీగా ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ తయారు చేసి సోమవారం విడుదల చేసినట్లు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆదేవిధంగా గ్రామ పంచాయతీలలో ఓటరు డ్రాఫ్ట్ జాబితా నోటీసు బోర్డుపై అంటిస్తామని తెలిపారు.

నామినేషన్ కార్యక్రమానికి తరలిన ఉపాధ్యాయులు

కెరమెరి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కరీంనగర్‌లో నామినేషన్ వేస్తున్న పీఆర్టీయూ నాయకుడు కూర రఘోత్తంరెడ్డికి మద్దతుగా సోమవారం కెరమెరి మండలానికి చెందిన సంఘ నాయకులు, ఉపాధ్యాయులు తరలివెళ్లారు.

జిల్లా అధ్యక్షుడు అడెప్రకాష్ నేతృత్వంలో మండల కేంద్రం నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు భాస్కర్, అజయ్, భూమన్న, దత్తు, మోహన్, సోము, బాజిరావు తదితరులు పాల్గొన్నారు.

- కాలిబాటలను దారులుగా మార్చేందుకు నిధుల కేటాయింపు
- రైతుల పనులకూ ప్రాధాన్యం

'ఉపాధి'లో పొలం బాటల అభివృద్ధి



వాంకిడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రైతుల పొలాల్లో బాటలను అభివృద్ధి చేసేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీంతో అనేక సంవత్సరాలుగా పొలాల్లో రాకపోకలకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తీరనున్నాయి. గతం లో నక్షా బాటలు, పూర్వ కాలం నుంచి బండ్ల బాటలు ఉన్న ప్రాంతాల్లో రహదారులను బాగు చేయగా.. తాజాగా రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక ను సిద్ధం చేస్తోంది. మార్చి నెలాఖరులోగా ఈ పనులను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. వీటిలో జల సంరక్షణ పనులతో పాటు రైతులు తమ పొలాలలకు వెళ్లేందుకు ఉన్న కాలినడక బాటలను బాగు చేసేందుకు చర్యలు చేపట్టారు.

● కిలోమీటర్‌కు రూ. 10 లక్షలు

రైతుల పొలాల మధ్య ఉన్న కాలిబాటలను దారులుగా మార్చేందుకు ఉపాధిహామీ పథకంలో కిలోమీటరుకు 10 లక్షలరూపాయల చొప్పున నిధులను కేటాయించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఆ నిధులను వెచ్చించేందుకు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్(టీ) నియోజన వర్గాల్లో రైతుల అంగీకారం మేరకు పొలం బాట పనులు చేపట్టనున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	మండలాలు	పంచాయతీలు	జాబ్‌కార్డులు	కూలీలు
ఆదిలాబాద్	17	468	1,75,747	3,70,082
కుమరంభీం	15	335	1,29,885	2,77,287
నిర్మల్	18	396	1,80,572	3,70,550
మంచిర్యాల	16	311	1,21,067	2,55,151

● రైతులకు ఉపయోగపడేలా..

రైతులకు ఉపయోగపడేలా పశువుల షెడ్లు, అజోల్లా పెంపకం, వర్మీ కంపోస్టు తయారీ పనులు, జలనిధి ద్వారా చెక్‌డ్యాంల నిర్మాణం, ఇంకుడు గుంతలు, వ్యవసాయ బావులు, వర్షం నీటిని ఒడిసిపట్టే నిర్మాణాలు చేపట్టనున్నారు. పొలాల బాటలను బాగు చేయడానికి ప్రతీ నియోజకవర్గంలో ప్రత్యేక నిధులు వెచ్చించనున్నారు. తమ ఆవాసాల నుంచి పొలాలకు చేరుకునేందుకు రైతులు సరైన రహదారి లేక ఒడ్డు, గట్ల మధ్య నడిచి వెళ్లేం దుకు ఇబ్బంది పడుతు న్నారు. ఎరువులు, విత్త నాలు, పురుగుమందులు, బోరు మోటార్లు, పైపులు తదితర సామగ్రిని పొలాల వద్దకు మోసుకెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో వారి కష్టాలు వర్ణనాతీతం. ప్రభుత్వం పొలాలకు బాటలను బాగు చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

-ఈజీఎస్ ఏపీవో శ్రావణ్



ప్రభుత్వం నిర్ణయంతో పొలాలకు కాలిబాటల్లో వెళ్లే రైతుల ఇబ్బందులు తీరుతాయి. పొలాల మధ్య నుంచి తమ బావుల వద్దకు, ఇతర పనుల నిమిత్తం వెళ్లే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. రైతుల అంగీకారంతో పొలం బాటల పనులు చేపడుతాము. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

మహిళా ఓటర్లే అధికం

- జిల్లాలో 3,54,691 మంది ఓటర్లు
- మహిళలు 1,77,567 ● పురుషులు 1,77,105



ఆసిఫాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఓటరు తుది జాబితాను విడుదల చేశామని జిల్లాలో మొత్తం ఓటర్లు 3,54,691 మంది ఉన్నారని జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 15 మండలాల్లో మొత్తం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు తుది ఓటరు జాబితాను విడుదల చేశామన్నారు. ఇందులో 1,77,105 మంది పురుష ఓటర్లు, 1,77,567 మంది మహిళా ఓటర్లు 19 మంది ఇతరులు మొత్తం 3,54,691 మంది ఉన్నట్లు పెర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు లిస్టులను జిల్లా పరిషత్, అయా ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రదర్శించామని తెలిపారు.

డిప్యూటీ సీఎంను కలిసిన మాలీ సంఘం నేతలు



భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న మాలీ సంఘం నాయకులు

వాంకిడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో అఖిల భారతీయ మాలీ మహా సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. అనంతరం 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెట్కులే సుకుమార్, మాలీ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గుర్నులే నారాయణ, మండల నాయకులు కృష్ణ, గుర్నలే మెంగాజీ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్: సీఐ



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ రవీందర్

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ చేపడుతున్నామని సీఐ రవీందర్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌ఆర్ కాలనీలో ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, ఏఎస్పీలు ప్రభాకర్‌రావు, చిత్తరంజన్ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆర్‌ఆర్ కాలనీలో నలుగురు ఎస్సైలు, 60 మంది పోలీసు సిబ్బందితో ఇంటింటా తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలులేని 82 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. రానున్నరోజుల్లో మరింత విస్తృతంగా తనిఖీలు నిర్వహించి నేరాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్డన్‌సెర్చ్‌లో ఎస్సైలు రాజేశ్వర్, శ్యాంరావు, ప్రశాంత్, అంజయ్య పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టర్‌లో ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్‌లోని ఏవో మధుకర్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ వైద్య విదాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికుల జీతాల చెల్లింపులో ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. నెలనెలా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు దివాకర్, రజిత, పుష్ప, పద్మ, సాయి, నరేష్, తిరుమల, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో డాక్టర్లు లేక ఇబ్బందులు



పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న రోగులు

జైనూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జైనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు లేనందున రోగులకు సరిపడా వైద్యం అందడం లేదు. పీహెచ్‌సీలో 7 మంది డాక్టర్ల పోస్టులు ఉండగా అందులో ప్రస్తుతం ఒక డాక్టరు మాత్రమే వైద్య సేవలు అందిస్తున్నారు. ఉన్న ఒకే ఒక డాక్టరు సైతం సెలవుల్లో ఉండగా ప్రస్తుతం రోగులకు వైద్యం అందని దుస్థితి నెలకొంది. పీహెచ్‌సీలో ప్రతీ రోజు 200 నుంచి 250 మంది రోగులు ఆసుపత్రికి వైద్యం కోసం వస్తుంటారు. ప్రస్తుతం గ్రామాల్లో వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈక్రమంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, వివిధ గ్రామాల ప్రజలు పీహెచ్‌సీకి వైద్యం కోసం రాకపోకలు చేస్తున్నారు. డాక్టర్లు లేనందున రోగులకు వైద్య సిబ్బందితో వైద్య సేవలు అందిస్తున్నారు. ఆదేవిధంగా పీహెచ్‌సీలో అడ్మిట్ అయిన రోగులు, గర్భిణీలకు ప్రతీరోజు భోజన సదుపాయం అందిస్తున్నారు కాని మెనూ ప్రకారం భోజనం అందడంలేదని గర్భిణులు వా పోతున్నారు. డాక్టర్లు లేక సరైనవైద్యం అందక స తమతమవుతున్నామని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి డాక్టర్ల పోస్టులు భర్తీచేయాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని రోగులు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి



పోలింగ్ కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్‌దోత్రే



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్‌దోత్రే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శాసన మండలి నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ కాంపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉపయోగించిన బ్యాలెట్ పేపర్ల వివరాలు నమోదు, పేపర్లు వరుస సంఖ్యలో ఉండేలా చుడాలన్నారు. జిల్లాలో 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, పోలింగ్ సిబ్బంది ఫారం-12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారంలోగా మరోసారి శిక్షణ ఇస్తామని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, తహసీల్దార్లు, ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన..

ఆసిఫాబాద్‌రూరల్ (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ జరుగనున్నందున జిల్లాలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న బోధన తీరుపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయలన్నారు. పరీక్షలకు 40 రోజుల సమయం మాత్రమే ఉన్నందున ప్రణాళికకు అనుగుణంగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. తహసీల్దార్ రోహత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

జైనూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్ ఆడ బీర్షావ్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇది వరకే ప్రభుత్వం 79 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను విడుదల చేసిందన్నారు. ఇందులో ఎస్సీ లబ్ధిదారులు ఏడుగురు, ఎస్టీ 44, బీసీలు 11 మందికి, షాదీ ముబారక్ కింద 17 మందికి చెక్కులు మంజూరు చేసిందని వివరించారు. ఈ మేరకు చెక్కులను తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశామని తెలిపారు.

కాగజ్‌నగర్ బస్టాండులో చోరీ

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ బస్టాండులో సోమవారం శకుంతల అనే మహిళ బ్యాగులోంచి మూడు తులాల గొలుసును ఎత్తుకెళ్లినట్టు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శకుంతల మంచిర్యాల బస్సు ఎక్కే సమయంలో ఒక్కసారిగా గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగులో ఉన్న మూడు తులాల బంగారాన్ని, నగదును ఎత్తుకెళ్లినట్టు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను ఈనెల 22న నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శివప్రసాద్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన బంజార, లంబాడీ సమన్వయ సంఘాల సమావేశంలో నూతన ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, గౌరవ అధ్యక్షులుగా రవినాయక్, శంకర్‌నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శివప్ర సాద్ మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల కు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకున్న ఉత్సవకమిటీ సభ్యుల ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు దుప్ప నాయక్, రవినాయక్, ఇందులాల్, గోపాల్‌నాయక్, రవింద్రనాయక్, అంబరావు, రూప్‌లాల్, బలరాం, మోహన్, గులాబ్‌సింగ్, అరవింద్ జాదవ్ పాల్గొన్నారు.

మూత్రపిండాల వ్యాధితో ఒకరి మృతి

బెజ్జూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన టాకిరె గణపతి(51) అనే వ్యక్తి ఆదివారం రాత్రి మూత్రపిండాలు చెడిపోయి మృతి చెందాడు. గణపతి మూడేళ్లుగా మూత్రపిండాలు చెడిపోయి బాధపడుతున్నాడు. చికిత్స కోసం ఆసుపత్రుల చుట్టు తిరుగుతున్నా నయం కాలేదు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

తుంగమడుగులో చోరీ

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ తుంగమడుగులో కన్నవేణి ప్రకాష్ ఇంట్లో చోరి జరిగినట్టు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తుంగమడుగులో నివాసం ఉంటున్న కృష్ణవేణి ప్రకాష్ ఈ నెల 7 నుంచి స్థానికంగా లేకపోవటంతో ఇంటికి తాళం వేసి ఉంది. సోమవారం ప్రకాష్ ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులు తెరిచిఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఇంట్లో ఉన్న రెండు తులాల బంగారం రూ.30వేల నగదు పోయినట్టు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

యువతకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయి

- సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు - పాల్వాయి పురుషోత్తంరావు మెమోరియల్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు

సిర్పూరు(టి), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలు యువతకు ఎంతో దోహదపడుతాయని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. సోమవారం సిర్పూరు(టి) మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు మెమోరియల్ టోర్నీని ప్రారంభించి అనంతరం మాట్లాడారు. క్రీడలు ఆడటం వల్ల శరీర దారుఢ్యం పెరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. గ్రామీణ ప్రాంతాల యువకులు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో సిర్పూరు బీజేపీ పార్టీ మండల అధ్యక్షురాలు లావణ్య, నాయకులు పైడి విలాస్, నానాయ్య, ఆశోక్, శ్యాంరావు, పైడి వేణుగోపాల్ గుప్తా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

- విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఎంఈవోలు, హెచ్‌ఎంలు కృషిచేయాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి సూచించారు. పట్టణంలోని బీఈడీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి సత్యనారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల నుంచి పదో తరగతిలో విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న స్లిప్ టెస్టు ఫలితాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలను జిల్లా కో ఆర్డినేటర్లు సందర్శించి విద్యార్థుల సామార్థ్యాలను పరీక్షించాలని ఆదేశించారు. సైన్స్ మెటిరీయల్ ఉప యోగించుకొని విద్యా ర్థులకు ఉత్తమంగా బోధించేలా దృష్టి సారించాలని సూచించారు. సమావేశం లో ఇన్‌చార్జి డీఈవో గామేనియల్, జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్‌బాబు, కో ఆర్డినేటర్లు కటకం మధుకర్, అబుద్ అలీ, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, ఎంఈవోలు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన అటవీ రేంజ్‌లోకి పెద్దపులి

కాసిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి అటవీ డివిజన్ పరిధిలోని ప్రజలకు పులి భయం వీడింది. 12 రోజులుగా ప్రజలను హడలెత్తించిన పెద్దపులి ఆదివారం రాత్రి రెబ్బెన అటవీ రేంజ్ గోలేటి సెక్షన్ అమీన్‌గూడ అటవీ శివారు ప్రాంతంలో పెద్దపులి పాదముద్రలను అటవీ శాఖ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. దీంతో ఉత్కంఠకు తెరపడింది. గత నెల 30న బెల్లంపల్లి అటవీ డివిజన్ పరిధిలోని ధర్మారావుపేట సెక్షన్, బుగ్గగూడెం అటవీ శివారు ప్రాంతంలో మొదట పులి పాదముద్రలను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. అప్పటి నుంచి కన్నాల పెద్దనపల్లి, దుబ్బగూడెం, వరిపేట గ్రామాల సరిహద్దు శివారు ప్రాంతాల్లో పులి సంచరించింది. పులి సంరక్షణకు అటవీ అధికారులు శ్రమించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. పులి సంరక్షణను పర్యవేక్షించిన బృందాలను అటవీశాఖ ఉన్నతాధికారులు అభినందించారు. పులికి అన్నివిధాల అనుకూలంగా ఉన్న బెల్లంపల్లి అటవీడివిజన్ పరిధిలోకి మళ్లీ పులి వచ్చే అవకాశం ఉందని అటవీ అధికారులు హెచ్చరిస్తున్నారు.

తాండూర్ మండలంలో పులి పాదముద్రలు

తాండూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాదారం గొంతెమ్మ గుట్ట ప్రాంతంలో పులి పాదముద్రలు గుర్తించామని ఫారెస్టు డిప్యూటి రేంజ్ ఆఫీసర్ తిరుపతి తెలిపారు. బెల్లంపల్లి రేంజ్‌పరిధిలో దాదాపు 12 రోజుల పాటు సంచరించిన పెద్దపులి ఆదివారం రాత్రి మండలంలోని మాదారంలోకి ప్రవేశించింది. కన్నాల బుగ్గ అటవీ ప్రాంతంతో పాటు కాసిపేట వైపు సంచరించిన పులి కన్నాల అడవుల మీదుగా మాదారం బీట్ పెగడపల్లి వైపు వచ్చినట్లు వెల్లడించారు. పాదముద్రల ఆధారంగా ట్రాకింగ్ బృందం పులి ఎటు వైపు వెళ్లిందని అంశంపై ఎప్పటికప్పుడు అధికారులకు సమీప గ్రామాల ప్రజలకు సమాచారం అందిస్తున్నామని తెలిపారు. డిప్యూటి రేంజ్ ఆఫీసర్ తిరుపతి వెంట ఫారెస్టు బీట్ అధికారులు భాస్కర్, యుగందర్, గోపి, వెంకటేష్, సమ్మయ్య బృందం ఉన్నారు. పులి తిర్యాణీ లేదా రెబ్బెన మండలం పులికుంట వైపువెళ్లి ఉండొచ్చ నే కోణంలో పరిశీలిస్తున్నారు. మాదారం, రేపల్లెవాడ, పెగడపల్లి పరిసర ప్రాంతప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

వాంకిడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి అక్రమంగా 12 పశువులను తరలిస్తున్న ఓ వాహనాన్ని సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రోజున మహారాష్ట్రలోని గడ్‌చాందుర్ నుంచి నిజామాబాద్ జిల్లాలోని సతాపూర్ మార్కెట్‌లో విక్రయించేందుకు టీఎస్ 18 టీ 8369 నంబరు గల వాహనంలో అక్రమంగా పశువులను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వాంకిడి టోల్ ప్లాజా సమీపంలో పోలీసు సిబ్బందితో కలిసి పట్టుకున్నామన్నారు. కారులో 10 ఆవులు, రెండు దూడలు ఉన్నాయన్నారు. వాహనంలో తరలిస్తున్న పశువులకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించి మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ అమీన్‌ఖాన్, వ్యాపారి షారూక్‌ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని ఒకరు మృతి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని రైలు ఢీ కొని ఒకరు మృతి చెందినట్టు రైల్వే పోలీస్ హెడ్ కానిస్టుబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్టు వివరించారు. మృతుడు లైట్ గ్రీన్ కలర్ చొక్కా, బ్లాక్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నట్టు తెలిపారు. ఆచూకి తెలిసిన వారు సెల్ నంబరు 9948481902 ను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్టు తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

భీమిని, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భీమిని మండల పరిధిలోని ఖర్జీభీంపూర్, చిన్నగుడిపేట, రాంపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. నిల్వ ఉన్న బెల్లం పానకం ధ్వంసం చేశారు. సారా బట్టీలను ధ్వంసం చేశారు. నాటు సారా తయారు చేస్తూ పట్టుబడిన ఖర్జీభీంపూర్‌కు చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ హుస్సేన్, డీటీఎఫ్ సీఐ సమ్మయ్యలు తెలిపారు. ఇందులో బెల్లంపల్లి ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓటర్ల జాబితా విడుదల

కాసిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ రెండవ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీల వారీగా ఓటర్ల జాబితాను ఎంపీడీవో సత్యనారాయణసింగ్ సోమవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను పురస్కరించుకుని ఎంపీటీసీల వారీగా ఓటర్ల జాబితాను నోటీసు బోర్డుపై అంటించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో షేక్ సప్దర్ ఆలీ, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంగాపూర్ జాతరకు వేళాయె

రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామ శివారులోని గుట్టపై ప్రకృతి ఒడిలో వెలిసిన బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులకు కొంగు బంగారంగా పేరు గాంచింది. ప్రతీ సంవత్సరం మాఘ శుద్ధ పౌర్ణమి నాడు తిరుమల తిరుపతి దేవస్థానంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి కొన్ని గడియల పాటు గంగాపూర్ ఆలయంలో కొలువు తీరి భక్తుల కోర్కెలు తీరుస్తారని ఇక్కడి ప్రజలకు ప్రగాఢ విశ్వాసం. దీంతో మాఘ శుద్ధ పౌర్ణమి నాడు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి వారికి మొక్కులు సమర్పించుకుంటారు. ఇందుకోసం ఆలయ నిర్వహకులు తగిన ఏర్పాట్లు చేశారు. - రెబ్బెన


గంగాపూర్ ఆలయం

- నేటి నుంచి మూడు రోజుల పాటు కొనసాగనున్న జాతర
- భారీగా తరలి రానున్న భక్తులు
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ శ్రీనివాస్ రావు

రెబ్బెన మండలం గంగాపూర్ శివారులో బాలాజీ వేంకటేశ్వర స్వామి జాతర ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించటానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లను చేపడుతున్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు స్వామి వారి కల్యాణాన్ని అంగరంగం వైభవంగా నిర్వహించటానికి ఆలయం ఎదుట ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు. అలాగే 12న మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామి వారి దర్శనానికి తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్ కోసం రోడ్డుకిరువైపులా స్థలాలను చదును చేసి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. అలాగే భక్తులు దర్శించుకునేందుకు ఎండబారిన పడకుండా టెంట్లను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ మంచినీటి సౌకర్యాన్ని కూడా కల్పించారు. జాతరలో పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా పరిసరాల్లో ఎలాంటి అపరిశుభ్రత లేకుండా చూడటానికి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 50 మంది పారిశుధ్య కార్మికులను నియమించారు.


కొలువైన స్వామివారలు

వారితో ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేయిస్తూ బ్లీచింగ్ పౌడర్ చల్లటానికి సిద్ధథా ఉంచారు. మండలంలోని 12 మంది కార్యదర్శులను ఆయా పనుల పర్యవేక్షణకు ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ స్థలాల్లో ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రముఖుల దర్శనం కోసం ప్రత్యేక లైన్ నిర్వహించారు. సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో జాతర పరిసరాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో 24 గంటల పాటు వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరం, రెండు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. ఈ సారి మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర లేక పోవటంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశాలున్నాయి. మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కు లు తీర్చుకుంటున్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోల నుంచి అధికారులు ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నారు.

జాతరకు భారీ భద్రత..

ఎస్పీ శ్రీనివాస్‌రావు



రెబ్బెన మండలం గంగాపూర్‌లో మంగళ, బుధ, గురు వారాల్లో జరుగనున్న జాతరకు భారీ భద్రత ఏర్పాట్లు చేశాము. ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో ఇద్దరు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, పదిమంది ఎస్సైలతో పాటు 300 మంది పోలీసులతో గట్టి భద్రత చర్యలు తీసుకుంటున్నాము. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి శాంతిభద్రతను పర్యవేక్షిస్తున్నాము.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా..

ఆలయ ఈవో బాపిరెడ్డి



గంగాపూర్ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నాము. ముఖ్యంగా క్యూ లైన్లలో నిలబడే భక్తులకు ఎండ తగులకుండా షామియానాలను ఏర్పాటు చేశాము. అక్కడక్కడా మంచి నీటి సౌకర్యం కల్పించాము. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను గుర్తించి బారికేడ్లను ఏర్పాటు చేశాము.

యాసంగిలో పప్పు దినుసులు సాగు చేసుకోవాలి

ప్రేమలత, వ్యవసాయాధికారి, కౌటాల



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా?

ఏవో: పంట మార్పిడి మీద రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ ద్వారా పంట మార్పిడి, కాలానుగుణంగా కావాల్సిన సలహాలు శాస్త్రవేత్తల ద్వారా రైతులకు అందిస్తున్నాం. రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రస్తుత కాలంలో రైతులు ఏ పంటలు వేస్తే లాభాలు వస్తాయి?

ఏవో: యాసంగి కాలంలో పప్పు దినుసుల సాగు చేసుకోవాలి. దాని వల్ల పంట మార్పిడి జరుగుతుంది. పురుగుల జీవిత చక్రం దెబ్బ తినడంవల్ల తరువాత పంటకు పురుగు ఉధృతి తగ్గుతుంది. పప్పు దినుసుల పంట వేయడం వల్ల నేలలో నత్రజని స్థిరీకరించబడుతుంది. తద్వారా భూసారం పెరుగుతుంది. దీని వల్ల యూరియా వాడకం తగ్గుతుంది.

ఆంధ్రజ్యోతి: సేంద్రియ వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపుతున్నారా?

ఏవో: సేంద్రియ వ్యవసాయం మీద రైతుల ఆసక్తి చూపుతున్నారు. పరమ్‌పరాగత్ కృషి వికాస్ యోజన(పీకేవీవై) పథకం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నాము.

- కౌటాల(ఆంధ్రజ్యోతి)

దివ్యాంగుడి కాళ్ల పైనుంచి వెళ్లిన ఆర్టీసీ బస్సు

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఆర్టీసీ బస్ డిపోలో సోమవారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బస్సు ఎక్కేందుకు వెళ్లిన ప్రయాణికుడి కాళ్ల పైనుంచి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. దీంతో ప్రయాణికుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. కోటపల్లి మండలం జనగాం గ్రామానికి చెందిన చెన్నూరి లక్ష్మణ్ మంచిర్యాలకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లేందుకు బస్టాండ్‌లో బస్ కోసం ఎదురు చూస్తున్నాడు. బస్సు పాయింట్ వద్దకు రావడంతో ఎక్కే క్రమంలో కింద పడి పోయాడు. దీంతో లక్ష్మణ్ కాళ్లపై నుంచి బస్ ముందు భాగంలోని రెండు టైర్లు ఎక్కడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని మంచిర్యాల పోలీసులు తెలిపారు. అత్యవసర చికిత్స నిమిత్తం లక్ష్మణ్‌ను కరీంనగర్ తరలించారు. సమయానికి బస్సులు రాకపోవడంతోనే ప్రయాణికులు ఒక్కసారిగా వచ్చిన బస్సుల చుట్టూ గుమిగూడడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 100
- ఉపాధ్యాయుల స్థానానికి 17
- నేడు పరిశీలన - 13న ఉపసంహరణ

కరీంనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఘట్టం ముగిసింది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి నామినేషన్లను స్వీకరించారు. పట్టభద్రుల స్థానానికి 100, ఉపాధ్యాయ స్థానానికి 17 నామినేషన్లు దాఖలయ్యాయి. మంగళవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ కొనసాగనుంది. ఈ నెల 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండగా 27న పోలింగ్ నిర్వహించనున్నారు. అయితే వరుసగా రెండో శనివారం, ఆదివారం సెలవుదినాలు రావడంతో సోమవారం ఎక్కువ మంది నామినేషన్లు వేస్తారని అంచనా వేసిన జిల్లా యంత్రాంగం భారీగా బందోబస్తు చేసింది. అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డితోపాటు పలువురు అభ్యర్థులు పోటాపోటీగా ర్యాలీగా వచ్చి నామినేషన్లను దాఖలు చేశారు. ఒక్క సోమవారమే పట్టభద్రుల స్థానానికి 51, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి తొమ్మిది నామినేష న్లు వేశారు.. పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టారు. టీపీసీసీ చైర్మన్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. అలాగే ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు నామినేషన్ దాఖలు చేశారు.


ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమర్ గౌడ్, మంత్రులు

కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ నామినేషన్ దాఖలు చేశారు. పట్టభద్రుల స్థానానికి పోటీచేస్తున్న పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులు ర్యాలీగా వచ్చి నామినేషన్లను సమర్పించారు. ఉద్యమకారుడు, కేసీఆర్ అభిమాని పిడిశెట్టి రాజు సైకిల్‌పై కలెక్టరేట్ వరకు చేరుకొని సాదాసీదాగా పట్టభద్రుల స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి టీపీటీఎఫ్ అభ్యర్థి వై అశోక్‌కుమార్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలిసి వచ్చి నామినేషన్ వేశారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డితోపాటు మరి కొంత మంది అభ్యర్థులు ర్యాలీగా వచ్చి నామినేషన్లను అందజేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ కలెక్టరేట్ నుంచి బయటకు వస్తున్న సమ యంలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి నరేం దర్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కు మార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ వాహనాలను కలెక్టరేట్‌లోకి అనుమతించడాన్ని తప్పుబడుతూ అడ్డుకున్నారు. పోలీసులు చేరుకొని మంత్రులను వాహనాల నుంచి దింపి వేయడంతో వివాదం సద్దుమణిగింది.

ఈ నెల 3న నామినేషన్ల స్వీకరణ ప్రారంభమగా నామినేషన్ వేసిన వారిలో పట్టభద్రుల స్థానం బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డి, కాంగ్రెస్ టికెట్ ఆశించి చివరి వరకు ప్రయత్నంచేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ, డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేసిన గంగాధర్, ఆదిలాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ఉపాధ్యాయ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా మల్క కొమురయ్య, సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, టీపీటీఎఫ్ అభ్యర్థి వై అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు. మంగళవారం నామినేషన్లను పరిశీలించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని, 27న ఎన్నికలు, మార్చి 3న ఓట్ల లెక్కింపు, ఫలితాలు ఉంటాయని వివరించారు.

రమాబాయి జయంతి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రమాబాయి అంబేద్కర్ జయంతి సందర్భంగా సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ కొత్తరోడ్డులో వేడుకలు నిర్వహించారు. రమాబాయి చేసిన త్యాగం, ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు అని వక్తలు పేర్కొన్నారు. మూడు ఏరియాలకు చెందిన 150 మంది మహిళలు, 18 మంది పురుషులు, 35 మంది చిన్నారులకు రమాబాయి అంబేద్కర్ జీవితం గురించి అవగాహన కల్పించారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్సీ లైజన్ అధికారి కిరణ్ కుమార్, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి రెడపాక లక్ష్మణ్, వేల్పుల ప్రవీణ్, సుందిళ్ల నరేష్, యుగేందర్ సాయి, వేముల కిరణ్, యోసఫ్, బాబురావు, ప్రేమ్‌కుమార్, రమ్య, సంధ్య, రవళి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

జైపూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం వైభంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు దంపతులు పాల్గొన్నారు. ఉదయం సీతారామచంద్రస్వామి నూతన ఆలయంలో స్థిరవిగ్రహసుదార్శన, గోదాదేవి, రామానుజ నమ్మల్‌వార్ చల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రధాన అర్చకులు శ్రీమాన్ గోవర్ధన గిరి జగన్నాథాచార్యుల శిష్య బృందం వేద పండితులైన వెంకటర మణాచార్యులు, సముద్రాల బానుకుమార్, సేనాపతి శేషాచార్యులు, తాండూరి వెంకటాచార్యులు, సముద్రాల అనంతాచార్యులు, భరతాచార్యుల ఆధ్వర్యంలో దైవ కార్యక్రమాలను పూర్తి చేశారు. ఈ నెల 7న అంకురార్పణ పూజలతో ప్రారంభమై ఈ నెల 10వ తేదీన తెల్లవారుజామున మూల విరాట్‌ల ప్రతిష్ఠాపన, గోపు రాన సుదార్శనచక్రస్థాపన, ధ్వజస్తంభ, ప్రాణప్రతిష్ఠ, బలినివేదన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అభిషేకం, అలంకరణ అనంతర అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సత్యనారాయణరావు మాట్లాడుతూ ఆలయ కమిటీ సభ్యులు సంవత్సర కాలంలో ఆలయాన్ని నిర్మిస్తామని చెప్పి అనుకున్న విధంగా సంవత్సరంలోపే నిర్మించడం గొప్ప విషయమన్నారు. ప్లాంటు రక్షణ, ఉద్యోగుల రక్షణార్థం నూతన సీతారామచంద్రస్వామి ఆలయం నిర్మించుకోవడం పూర్వజన్మసుకృత మన్నారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు రాజు, సుధాకర్‌రెడ్డి, రిటైర్డు జీఎం నర్సింహారెడ్డి, ఎస్టీపీపీ ఇన్‌చార్జీ ఈడీ శ్రీనివాసులు, అధికారులు జేఎన్‌సింగ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సుధాకర్, ఆలయకమిటీ సెక్రటరీ సముద్రాల శ్రీనివాస్, ప్రసాద్, ఏఐటీయూసీ పిట్‌సెక్రటరీ సత్యనారాయణ, అజ్మీర తుకారం తదితరులు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న డైరెక్టర్ సత్యనారాయణరావు, అధికారులు



సింగరేణి డైరెక్టర్‌గా సూర్యనారాయణ



శ్రీరాంపూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్)గా శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఎల్‌వీ సూర్యనారాయణ ఎంపికయ్యారు. సూర్యనారాయణ 12 అక్టోబరు 1989న సింగరేణిలో ఉద్యోగం పొందారు. అనంతరం ఆయన వివిధ హోదాల్లో 35 ఏళ్లుగా కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు, గోదావరిఖనిలో పనిచేశారు. నవంబరు 3న ఆర్‌జీ-2 ఏరియా నుంచి శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీపై వచ్చిన ఆయన ఇప్పటి వరకు జీఎంగా పనిచేశారు. ఆయన సీనియారిటీ, పనితనాన్ని అనుసరించి సోమవారం సింగరేణి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్)గా పదోన్నతి పొందారు. సూర్యనారాయణ డైరెక్టర్‌గా ఎంపిక కావడంపై శ్రీరాంపూర్ ఏరియా ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే డైరెక్టర్(ఆపరేషన్స్)గా ఏఎల్‌పీలో జీఎంగా పనిచేస్తున్న కొప్పుల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు.

రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డు కార్మికులకు రూ.20 లక్షల గ్రాట్యుటీ చెల్లించాలని టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్ అన్నారు. సోమవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డబ్ల్యూసీఎల్‌లో కార్మికులు 1-1-2017 నుంచి 31-1-2018 వరకు గ్రాట్యుటీ విషయంలో కోర్టులో కేసువేశారని 2017 నుంచి గ్రాట్యుటీ ఇవ్వాలని కోర్టు తీర్పునిచ్చిందన్నారు. వెంటనే లేబర్ కమిషనర్ సింగరేణి సీఎండీ దృష్టికి తీసుకువెళ్లి కార్మికులకు రావాల్సిన గ్రాట్యుటీ రూ. 20 లక్షలు ఇప్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాజయ్య, సత్తయ్య, ఓదెలు, తాహెర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సమస్యను పరిష్కరించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్, ఏరియర్స్ సమస్యను పరిష్కరించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జనవరి నెలకు సంబంధించి పెన్షన్ ఇంతవరకు రాలేదన్నారు. 2021 జూలై నుంచి 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన ఏరియర్స్, పెరిగిన పెన్షన్‌ను ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సేవలు ప్రశంసనీయం : జీఎం

రెబ్బెన, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గోలేటి సింగరేణి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సేవలు ప్రశంసనీయమని బెల్లంపల్లి ఏరియా సింగరేణి జీఎం శ్రీనివాస్ అన్నారు. సోమవారం పాఠశాల పది పరీక్షలు రాసే విద్యార్థులకు వార్షిక పరీక్షల కోసం వివిధ పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు చక్కటి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు వివరించారు. పది పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్, కరస్పాండెంట్‌రెడ్డి మల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, ప్రధానోపాధ్యాయుడు రవితేజ, పీఈటీ భాస్కర్, పూర్వ విద్యార్థ కమిటీ సభ్యులు కోట సుధాకర్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలను పంపిణీ చేస్తున్న జీఎం శ్రీనివాస్

ఎస్‌ఆర్‌పీ-1 గనిలో కూలిన భారీ బండ

- కార్మికులకు తప్పిన ప్రమాదం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ 1 గనిలో సోమవారం మొదటిషిఫ్ట్‌లో భారీగా బండ కూలిందని కార్మికులు పేర్కొన్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... సుమారు 8.30 గంటల సమయంలో 6 సీమ్‌లో 26-28 లెవల్ వద్ద రెండు చోట్ల ఆరు ఫీట్ల మందంతో బండ పడింది. అయితే అప్పటికి పనిస్థలాలకు కార్మికులు వెళ్లనందున భారీ ప్రమాదం తప్పింది. ఈ విషయాన్ని బయటికి తెలియకుండా అధికారులు అప్రమత్తమైనట్టుగా విమర్శలు వస్తున్నాయి. సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లే బండ కూలిందని, అక్కడ కార్మికులు ఉండి ఉంటే ప్రాణాపాయం కలిగి ఉండేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోమారు ఇలాంటి ఘటన జరుగకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు. ఈ విషయం గురించి ఎస్ఆర్‌పీ 1 గని మేనేజర్ విజయ్ కుమార్‌ను వివరణ కోరగా, చిన్నచిన్న బండలు తరచూ పడుతుంటాయని, కార్మికులు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదని ఆయన తెలిపారు.

ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మాల మహానాడు నాయకుడు పైడిమల్ల నర్సింగ్ నోరుందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని నేతకాని మహావీర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చునార్కర్ రాంబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్లపల్లి రాజమల్లు ధ్వజమెత్తారు. సోమవారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో నేతకాని కులానికి జరిగిన అన్యాయం గురించి ఇటీవల హైద్రాబాద్‌లో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ మాట్లాడారన్నారు. మూడు గ్రూపులో మాలలతో పాటు నేతకాని కులాన్ని చేర్చడంతో కులంలో చదువుకున్న విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని చెప్పారన్నారు. దీనిపై మాజీ ఎంపీ వెంకటేష్ నేత, రాజేష్ నేతలను కించపరి చేలా మాట్లాడడం సరైంది కాదన్నారు. నాయకులు రాజమల్లు, లక్ష్మీ, సంతోష్, రాజయ్య పాల్గొన్నారు.

కేసు నమోదు

భీమారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన పలువురు బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు భీమారం ఎస్ఐ శ్వేత సోమవారం తెలిపారు. బీఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ రాజ్‌కుమార్‌తో పాటు ఎనిమిది మంది బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సైన్స్ ఉపాధ్యాయుడికి సన్మానం

కోటపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సైన్స్ ఎగ్జిబిట్, వైజ్ఞానిక మేళాల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎన్నికైనందున మండలంలోని అన్నారం పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఎస్. సురేందర్‌ను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి లలితతో పాటు పలువురు అధికారులు సన్మానించారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి లలిత, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, సెక్టోరియల్ అధికారి చౌదరి, ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం అధ్యక్షుడు త్రిమూర్తి పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్టు

నెన్నెల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) పెద్దలంబాడితండాలో నాటుసార విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం పట్టు కున్నామని నెన్నెల ఎస్సై ప్రసాద్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారంతో దాడి చేసినట్టు పేర్కొన్నారు. గుర్రె జగ్గయ్య వద్ద 40 లీటర్లు, ధరావత్ రవి వద్ద 30 లీటర్ల గుండుబా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

అరకొర సిబ్బంది.. రోగుల ఇబ్బంది



బెల్లంపల్లిలోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి

- బెల్లంపల్లి వంద పడకల ఆసుపత్రిలో వేధిస్తున్న వైద్యుల కొరత
- 30 పడకల సిబ్బందితోనే సేవలు
- పరికరాలు లేక.. అందని మెరుగైన వైద్యం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అంటూ దశాబ్దాల క్రితం ఓ కవి అన్న పలుకులు నేటికి అక్షర సత్యాలేనని నిరూపిస్తున్నాయి. గత ప్రభుత్వం బెల్లంపల్లిలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని కోట్ల రూపాయలు ఖర్చు చేసి అందమైన భవనాలు నిర్మించి వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసింది. కానీ ఈ ఆసుపత్రిలో కొన్నేళ్లుగా వైద్యులు, సిబ్బంది, పరికరాలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో 30 పడకల ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. ఈ కారణంతో నియోజకవర్గంలోని ప్రజలతో పాటు దూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులు అరకొర వైద్య సేవలతో ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి సాయి పెరిగినా తగిన వైద్య సిబ్బందిని నియమించడంలో ప్రజాప్రతినిధులు , అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

హోదా పెరిగినా... అరకొర సిబ్బంది...

ఆసుపత్రి స్థాయి హోదా పెరిగినప్పటి నుంచి రోగుల సంఖ్య కూడా అధికమవుతుంది. ఇందుకు తగినట్లుగా వైద్య సిబ్బందిని నియమించలేదు. ఫలితంగా స్థాయికి తగిన సేవల్లో లోపం ఏర్పడుతుందనే విమర్శలు వస్తున్నాయి. ఆసుపత్రి హోదా పెరిగినప్పటి నుంచి వైద్యులను నియమించలేదు. ప్రస్తుతం వంద పడకల ఆసుపత్రిలో ఆరుగురు రెగ్యులర్ వైద్యులు, ముగ్గురు కాంట్రాక్టు వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రి స్థాయికి అనుకూలంగా పదుల సంఖ్యలో వైద్యులు అవసరం ఉన్నా భర్తీచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



చిన్నారికి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యుడు

పేరుకే వంద పడకలు... మెరుగు పడని సేవలు

బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి 30 పడకల ఆసుపత్రిగా ఉండేది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2021 సంవత్సరంలో రూ. 17 కోట్ల నిధులతో 100 పడ కల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ విశాలమైన భవనంతో పాటు రోగులకు వంద పడకలు ఉండేలా గదులను ఏర్పాటు చేశారు. ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ సేవలు మాత్రం మెరుగు పడలేదు. నియోజకవర్గ ప్రజలకు ఈ ఆసుపత్రే పెద్ద దిక్కుగా ఉంటుంది. బెల్లంపల్లి మండలంతో పాటు కన్నెపల్లి, భీమిని, తాండూర్, నెన్నెల, కాసిపేట మండలాలతో పాటు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం, పెంచికలపేట నుంచి ప్రతి రోజు ఈ ఆసుపత్రికి 200 నుంచి 300ల వరకు అవుట్ పేషెంట్‌లు వస్తున్నారు. అంతేకాకుండా ప్రసవాల కోసం గర్భిణులు సైతం ఈ ఆసుపత్రిలోనే అడ్మిట్ అవుతారు. విశాలమైన స్థలంలో పూర్తిస్థాయి గదులతో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గత ప్రభుత్వం నూతన ఆసుపత్రిని నిర్మించింది. 30 పడకల నుంచి వంద పడకలకు అప్‌గ్రేడ్ చేసిన తర్వాత ప్రభుత్వం స్థాయికి తగినట్లు వైద్యులను నియమించలేదు. 30 పడకల వైద్య సిబ్బందితోనే ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో సేవలందిస్తుండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

అలాగే ఈ ఆసుపత్రిలో వైద్యుల కొరతతో పాటు పలు సమస్యలు సైతం వేధిస్తున్నాయి. రోగులతో వచ్చే సహాయకులకు ప్రత్యేక వార్డు లేకపోవడం, గైనిక్ వార్డు, పీడియాట్రిక్ వార్డు లతో పాటు రక్తం నిల్వ ఉంచే బ్లడ్ స్టోరేజీ కేంద్రం సైతం ఏర్పాటు చేయలేదు. నూతనంగా భవనం నిర్మించిన ప్పటికీ ఆసుపత్రి వెనకాల కాంపౌండ్ వాల్ లేకపోవడంతో పశువులు ఆసుపత్రి ఆవరణలోకి వస్తున్నాయి. జన రేటర్‌కు గది లేకపోవడం, ఆసుపత్రికి వచ్చిన రోగుల వాహనాలు నిలుపుకునేందుకు పార్కింగ్ షెడ్డు కూడా అందుబాటులో లేదు. అలాగే ప్రధానంగా ఎన్నో ఏళ్లుగా పోస్టుమార్టం నిర్వహించే సరైన గది లేకపోవడం, మృతదేహాలను భద్రపరిచేందుకు ఫ్రీజర్లు కూడా లేవు.

ఆస్పత్రిలో సిబ్బంది ఖాళీల సంఖ్య

సివిల్ సర్జన్ స్పెషలిస్టులు	8
సివిల్ సర్జన్‌ఆర్‌ఎంవో	1
సివిల్ అసిస్టెంట్ సర్జన్	13
డిప్యూటి సివిల్‌సర్జన్	3
డిప్యూటి డెంటల్‌సర్జన్	1
ఫిజియోథెరపి	1
హెడ్‌నర్సు	3
అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్	1
హెల్త్ ఇన్‌స్పెక్టర్	1
స్టాఫ్ నర్సు	16
నర్సింగ్ సూపరింటెండెంట్	2
జూనియర్ అనలిస్టు	1
ఫార్మాసిస్టు గ్రేడ్	1
ఆఫీస్ సూపరింటెండెంట్	1
సీనియర్ అసిస్టెంట్	2
ల్యాబ్ టెక్నిషియన్	3
రేడియోగ్రాఫర్	1
డార్క్‌రూం అసిస్టెంట్	1
ఏఎన్ఎం	2
థియేటర్ అసిస్టెంట్	2
జూనియర్ అసిస్టెంట్	1

ఈ పోస్టుల భర్తీకి సంబంధించి ప్రతిపాదనలు పంపించినప్పటికీ పోస్టులు మంజూరు చేసిన దాఖలాలు లేవు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రిలోని ఐసీయూ వార్డు సైతం వైద్యులు లేక పోవడంతో ఇప్పటికి తెరుచు కోలేదు. ఎవరైనా అత్యవసర సమయంలో ఆసుపత్రికి వస్తే మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికే ఇక్కడి వైద్యులు రెఫర్ చేస్తున్నా రు. ఇప్పటికైనా హోదా పెరిగిన ఈ ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సిబ్బందిని నియమించాలని ప్రతిపాదనలు పంపించాం: డాక్టర్ పీవీవీఎస్ఎన్ మూర్తి, ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్



ప్రస్తుతం ఆసుపత్రిలో 30 పడకలకు సంబంధించిన వైద్య సిబ్బందే ఉన్నారు. అయినప్పటికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. వంద పడకలకు సంబంధించి ఖాళీగా ఉన్న వైద్య సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేస్తే మరింత మెరుగైన వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుంది.

విదేశీ బాట..

(5వ పేజీ తరువాయి)

తల్లిదండ్రులు అంగీకరించక తప్పని పరిస్థితులు ఉన్నాయి. ముఖ్యంగా బ్యాంకుల్లో ఎడ్యుకేషన్ లోన్లు తీసుకొని వెళ్తున్నవారే అధికంగా ఉంటున్నారు. చదువు పూర్తయ్యే వరకు నెలవారీ కిస్తులు కట్టాల్సిన అవసరం ఉండకపోవడం, ఆ తరువాత ఏదో ఒక ఉద్యోగంలో చేరుతామనే గట్టి నమ్మ కంతో విదేశాలబాట పడుతున్నారు.

లక్ష్యంతో వెళ్లితేనే భవిష్యత్



జీవీవీ శేఖర్, లిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్

నేడు విదేశాలకు వెళ్లే యువతను రెండు రకాలుగా చూడ వచ్చు. మొదటిది చాలినంత నైపుణ్యంతో వెళ్లి విదేశాల్లో గౌరవ ప్రదమైన జీవితం గడపాలనే ఆలోచన. రెండవది ఏదోలా ఫారిన్ వెళ్లాలి, పార్ట్‌టైం జాబ్ చేస్తే సరిపోతుందన్న ఆలోచన. రెండవ ఆలోచన అత్యంత ప్రమాదకరం. ఫారిన్ యూనివర్సిటీ అయినా.. మరే దయినా.. ఫీజులు తీసుకునే విద్యను అందిస్తాయి. యూనివర్సిటీలకు ఆదే ఆదాయం. విదేశాల్లో డిగ్రీ చేయాలంటే రూ. 50 లక్షల వరకు ఫీజులు చెల్లించాలి. వాటి కోసమైనా యూనివర్సిటీలు అడ్మిషన్లు ఆఫర్ చేస్తాయి. నిజంగా స్కిల్ ఉండి వెళ్లే వారు కేవలం 20 శాతం మంది మాత్రమే. మిగతా వారు భవిష్యత్తు ఎలా ఉంటుందన్న అవగాహన లేకుండా, నిబంధనలు తెలియకుండా వెళ్తున్నారు. దీంతో పార్ట్ టైం జాబ్స్ చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కొన్ని దేశాల్లో ఆర్థిక స్థితిగతుల దృష్ట్యా కఠినమైన ఆంక్షలు విధిస్తున్నారు. ఈ కారణంగా పార్ట్ టైం జాబ్స్ చేసేవారికి ఇబ్బందులు తప్పవు. స్థిరమైన, క్రమశిక్షణతో కూడిన జీవితం కావాలనుకునే వారు తమ నైపుణ్యాన్ని దృష్టిలో ఉంచుకొని విదేశాలకు వెళితే భవిష్యత్తు ఉంటుంది.

కులగణన సర్వేకు చట్టబద్ధత కల్పించకుండా ఆపాలి

దండేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను చట్టబద్దత చేయకుండా వెంటనే ఆపాలని నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికారి ప్రతినిధి గోళ్ల రాజమల్లు డిమాండ్ చేశారు. సోమవారం దండేపల్లి తహసీల్దార్ సంధ్యరాణిని సంఘం నాయకులతో కలిసి ఆమెకు వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేతకాని కులస్థులను కులగణన సర్వేలో పూర్తి స్థాయిలో చూపించలేదన్నారు. రాష్ట్రంలో నేతకాని జనాభా ప్రస్తుతం 15లక్షలకు పైబడి ఉంటే, ప్రభుత్వం మాత్రం 1,33,072 జనాభాను చూపించడంతో తాము అన్ని విధాలా తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. మరోసారి కులగణన సర్వే చేపట్టిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు జాడి ఇస్తాకర్, టేకుమట్ల లక్ష్మణ్, రత్నం తిరుపతి, గోళ్ల రవి, చెంద్రయ్య, ప్రవీణ్, సుధాకర్, శేఖర్, తిరుపతి పాల్గొన్నారు.

దేవుని విగ్రహాలను పరిరక్షించండి

వేమనపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజారాం గ్రామంలోని దశావతరాల విగ్రహాలను పరిరక్షించాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు మధుకర్ మాట్లాడుతూ దశావతరాలు అతి ప్రాచీనమైనది చారిత్రాకంగా కీలకమైందని, ప్రాణహిత పరివాహక ప్రాంతంలో ఈ పల్లెల్లో అనేక ప్రాచీన జీవరాశుల అవశేషాలు ఉన్నాయన్నారు. వేమనపల్లిపేరు వినగానే మొదటగా డైనోసార్ శిలాజాలు, దశావతరాలు విగ్రహాలు గుర్తుకు వస్తాయన్నారు. ఇలాంటి ప్రాచీనమైన విగ్రహాలను పార్టీల నిర్లక్ష్యం చేస్తున్నాయని పేర్కొన్నారు. వెంటనే వీటిని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహేందర్, సంతోష్, శేఖర్, వెంకటేష్, అజయ్, మధునయ్య, స్వామి, సతీష్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

గర్మిళ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగిన పదవీ రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఇద్దరు ఫైనల్స్‌కు చేరుకుని విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచారని స్టార్ మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పుల్లూరి సుధాకర్ తెలిపారు. మందమర్రికి చెందిన రా జలింగు 75 ప్లస్ విభాగంలో సింగిల్స్‌లో విన్నర్‌గా, డబుల్స్‌లో వరంగల్ క్రీడాకారుడు రిటైర్డు డీఎస్పీ నర్సయ్యతో కలిసి పాల్గొని విన్నర్‌గా నిలిచారని తెలిపారు. 35 ప్లస్ విభాగంలో జిల్లా కేంద్రానికి చెందిన క్రీడాకారులు సికింద్రాబాద్ డిఫెన్స్ పెన్షన్ విభాగంలో పనిచేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయిన హర్షవర్ధన్, మిక్స్‌డ్ డబుల్స్‌లో హైద్రాబాద్ క్రీడాకారుని ప్రశాంతితో కలిసి ఫైనల్‌కు చేరుకుని రన్నర్స్‌గా నిలిచారన్నారు. వీరు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ చేతుల మీదుగా ట్రోఫీ, సర్టిఫికెట్ అందుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన పల్లెం రాజలింగు, హర్షవర్ధన్‌లు మార్చిలో గోవాలో జరిగే జాతీయ స్థాయిపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ముకేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు భాస్కర్ల వాసు, బండ మీనారెడ్డి, ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ రమేష్‌రెడ్డి, తదితరులు అభినందించారు.

డయేరియాతో వృద్ధుడి మృతి

చెన్నూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని గోదావరి రోడ్డుకు చెందిన భీముని రామగౌడ్ (75)సోమవారం డయేరియాతో మృతి చెందాడు. రామగౌడ్‌కు ఈ నెల 5న వాంతులు, విరేచనాలు కావడంతో కుటుంబీకులు పట్టణంలోని ఆస్పతిలో చేర్పించారు. చికిత్స అందించినా అదుపులోకి రాకపోవడంతో వైద్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. దీంతో కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి రామాగౌడ్‌ను తరలించారు. చికిత్స తీసుకున్నా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో కుటుంబీకులు రామగౌడ్‌ను ఆదివారం రాత్రి చెన్నూరుకు తీసుకొచ్చారు. సోమవారం ఉదయం అస్వస్థతకు గురై మృతిచెందాడు.

కన్నుల పండువగా మల్లన్న జాతర

దండేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం గ్రామ శివారులో మల్లన్న స్వామి దేవాలయంలో సోమవారం అంగరంగ వైభవంగా మల్లన్న స్వామి పట్నాల బోనాల జాతర జరిగింది. భక్తులు డప్పుచప్పుల నడుమ బోనాలు నెత్తిమీద ఎత్తుకొని ఊరేగింపుగా దేవాలయం చట్టు బోనాల ప్రదక్షిణ చేసి ప్రత్యేక పూజాలు చేశారు. అనంతరం మల్లన్నస్వామికి నైవేద్యంతో బోనాలు సమర్పించారు.

కౌలు రైతుల ధర్నా

చెన్నూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పత్తి అమ్మకాలు జరిపేందుకు గాను తాత్కాలిక రిజిస్ట్రేషన్‌లు చేయాలని కౌలు రైతులు చెన్నూరులోని కాటన్ మిల్లు ముందు చెన్నూరు మంచిర్యాల ప్రధాన రహదారిపై సోమవారం ధర్నా నిర్వహించారు. భూములను కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్న రైతులకు పత్తి అమ్ముకునేందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సంబంధిత అధికా రులను ఒప్పించి ధర్నాను విరమింపజేశారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

కోటపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏదుల బంధం గ్రామంలో సోమవారం ముత్యాలమ్మ జాతర ఘనంగా కొనసాగింది. గిరిజనుల సంప్రదాయం ప్రకారం గిరిజన పూజారీ జేక లచ్చయ్య ఆధ్వర్యంలో ముత్యాలమ్మ, లక్ష్మీదేవర, మదన పోచమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం కొత్త కుండలో వండిన ప్రత్యేక నైవేద్యంతో అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఏదులబంధంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలి వచ్చారు.

ఏడాదిలో 56 వేల ఉద్యోగాలిచ్చాం..

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్
- నాలుగు ఉమ్మడి జిల్లాల ముఖ్య కార్యకర్తలతో సమావేశం



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టిన ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలిచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) చైర్మన్ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్‌రెడ్డి సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అన్ని శాఖల్లోని ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. తెలంగాణ ఏర్పడిందే ఉద్యోగాల కోసమన్నారు. బండి సంజయ్ రాష్ట్రానికి, తన నియోజకవర్గమైన కరీంనగర్‌కు ఒక్క రూపాయి తీసుకురాలేదని, బీజేపీకి ఎంపీలుండి లాభంలేదని, ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ మొఖం పెట్టుకుని ఓట్లు అడుగుతా రని ప్రశ్నించారు. ఈ విషయంపై పట్ట భద్రులు బీజేపీ ఎంపీలు, నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కదని ముందే గుర్తించిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను పోటీలో నిలుపకుండా బీజేపీకి సహకరిస్తోందని విమర్శించారు. అందరూ నరేందర్‌రెడ్డి గెలుపునకు సహకరించాలని కోరారు.

- రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు ఇస్తోందని, 10 ఏళ్లగా లేని డీఎస్సీ పరీక్షలు నిర్వహించి 10 వేల టీచర్లను భర్తీ చేసామన్నారు.

పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ జీవన్‌రెడ్డి స్థానాన్ని నరేందర్‌రెడ్డితో గెలిపించి భర్తీ చేయాలని కోరారు.10 ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్‌లు ఇచ్చామన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువతకు అండగా నిలవాలున్నారు. టీచర్ల బదిలీలు చేపట్టి అండగా ఉన్న ప్రభుత్వానికి మీరు అండగా ఉండాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ బీజేపీ మతత్వ ఎజెండాతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... గత ఐదు నెలల్లో మూడు సార్లు ప్రచారం చేసి అందరి మన్ననలు పొందనని, అందుకే ఏఐసీసీ తన ను అభ్యర్థిగా నియమించిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు పో తుందని తెలిపారు. జీవన్‌రెడ్డి అడుగు జాడల్లో ముందుకు సాగుతానన్నారు.

భారీ ర్యాలీ

కరీంనగర్, మెదక్, అదిలాబాద్, నిజామాబాద్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్‌రెడ్డి నామినేషన్ వేసేందుకు ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాహనంలో కలెక్టరేట్‌కు చేరుకుని నామినేషన్ పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, బల్మూరి వెంకట్, ప్రభుత్వ విప్‌లు, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ధర్మ పురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ దాని అను బంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు బండి సదానందం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

●పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, సొత్కు సుదర్శన్‌లు కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. నాయకులు పుల్లూరి లక్ష్మణ్, పైడిమల్ల నర్సింగ్, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

నెన్నెల : మండల కేంద్రంలో కేక్ కట్ చేసి, స్వీట్లు ఇచ్చిపుచ్చుకొని సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గట్టు మల్లేష్, నాయకులు తోట శ్రీనివాస్, మల్లాగౌడ్, బానేష్, తిరుపతి, మహేష్, పాల్గొన్నారు.

చెన్నూరు : ఎంపీ పుట్టిన రోజు సందర్భంగా కోటపల్లి మండలంలోని పారుపెల్లి గ్రామంలోని భైరవస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. చెన్నూరులో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

టోర్నమెంట్ విజేత ఫ్రెండ్స్ 11 జట్టు

తాండూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పట్టెం విష్ణు కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాకా వెంకటస్వామి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ టోర్నీలో ఫ్రెండ్స్ 11 జట్టు విజేతగా నిలువగా, శివాజీ సీనియర్స్ రన్నర్‌గా నిలిచారు. విజేతలకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్‌లు బహుమతులు అందించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు శంకర్‌గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండీ జుబేర్, నాయకులు శ్రీధర్, సాగర్, తిరుపతి ఉన్నారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణం తిలక్ నగర్ చెందిన వికలాంగులైన సల్లూరి గట్టయ్యపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. గట్టయ్యకు తిలక్ నగర్‌లో ప్రభుత్వం సర్వే నెంబర్ 61లో 100 గజాల స్థలంలో ఇల్లు క ట్టిచ్చింది. ఈనెల 5న సుజాత రాంబాయి అను మహిళలు ఇల్లును కులాగొట్టారని తెలుసుకొని గట్టయ్య అతని భార్యతో పాటు ఆ స్థలం వద్దకు వెళ్లి అడిగాడు. సుజాత రాంబాయి మల్లేష్‌లతో పాటు నరేష్, రజాక్, లింగయ్య చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారు. గట్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ నాయకుడు రఘునాథ్ ఎరబెల్లి అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఓడగొట్టాలని చూస్తున్నాయన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాల యంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పార్టీ నిరు ద్యోగ యువతను, ఉపా ధ్యాయులను మోసం చేస్తే ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 14 నెలల నుంచి యువత, నిరుద్యోగ యువతను, ఉపా ధ్యాయులను మోసం చేస్తోందన్నారు. ఉపాధ్యా యుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు.

నిరుద్యోగులకు, ఉపాధ్యాయులకు, పట్ట భద్రులకు బీజేపీ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు అశోక్, వెంకటకృష్ణ, కృష్ణమూర్తి, సతీష్‌రావు, శ్రీదేవి, వెంకటరమణరావు, రాజ్‌కుమార్, రమేష్, స్వామిరెడ్డి, లచ్చన్న, మల్లేష్, శ్రీనివాస్, రాజన్న, వెంకన్న, వెంకటేష్, తిరుపతి, తరుణ్‌సింగ్, సదయ్య మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యథావిధిగా భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12 నుంచి 15 వరకు నడుస్తుందని, సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11 నుంచి 14 వరకు నడుస్తుందని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్‌రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలో ఇంటర్ లాకింగ్ పనులు నడుస్తున్న నేపథ్యంలో రైల్వే అధికారులు ఈనెల 10 నుంచి సిర్పూరు కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే భాగ్యనగర్ ఎక్స్ ప్రెస్ (17234), సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ (17233) రద్దు చేశారు. అయితే ఈ నెల 15 వరకు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు కొనసాగుతాయని, 15 తర్వాత భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ నడుస్తుందా లేదా తెలియనుంది.

రుచితను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

కోటపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రిపబ్లిక్‌డే ఉత్సవాల్లో భాగంగా ఢిల్లీలో నిర్వహించిన పరేడ్ ఎన్ఎస్ ఎస్ వలంటీర్‌గా ఎంపికైన మోడల్ స్కూల్ పూర్వ విద్యార్థిని గుగులోత్ రుచితను విద్యార్థులందరు ఆదర్శంగా తీసు కోవాలని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ అన్నారు. సోమవారం రుచితను పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులు లలిత, దేశ్యానాయక్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాము, సీనియర్ ఉపాధ్యాయులు అనిత, లిల్లీ జోయెల్, శ్రీనివాస్, కేవీ రమణ, సలీం తదితరులు పాల్గొన్నారు.

విదేశీ బాట..



- ప్రతీ 10 మందిలో నలుగురిది అదే ఆలోచన
- ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చుకోవడమే లక్ష్యం
- మధ్యతరగతి కుటుంబాల నుంచే ఎక్కువ పయనం

మంచిర్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బీటెక్ పూర్తికాగానే యువత డాలర్ డ్రీమ్స్‌లో తేలిపోతోంది. పట్టా చేతికందగానే విదేశాలకు పయనం అయ్యేందుకు తహతహలాడుతోంది. తక్కువ శ్రమ ఎక్కువ ప్రతిఫలం...అనతికాలంలోనే కోట్లకు పడగలెత్తే అవకా శాలుండటం.. విలాసాలతో కూడిన ఆధునిక జీవన శైలి.. నాణ్యమైన ప్రమాణాలు.. ఇలా ఒక్కటేమిటి అ నేకానేక అంశాలు.. యువత విదేశాలకు వెళ్లేందుకు పురిగొల్పుతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిమంది ఎంఎస్ చదువుల పేరుతో అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, జర్మని, యూకే వంటి దేశాలకు తరలి పోతున్నారు. ఇండియాలో ఉద్యోగ అవకాశాలు, సంపాదన, జీవనశైలి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో నేటియువత విదేశాలకు తరలి వెళ్లేందుకే మొగ్గు చూపుతోంది. తమ కుటుంబంలోని వాళ్లు, ఊరి వా ళ్లు, బంధువులు అప్పటికే విదేశాల్లో స్థిరపడటంతో వారి ప్రోత్సాహంతో ప్రతియేటా పెద్ద సంఖ్యలో యు వత విదేశాల బాటపడుతున్నారు. ఒకప్పుడు ఊరికి ఒక్కరు విదేశాల్లో ఉంటే గొప్పగా చెప్పుకునే రోజుల నుంచి ప్రతీ గ్రామం నుంచి పదుల సుఖ్యలో వెళ్లే రోజులు వచ్చాయి. మాస్టర్స్ చదువు అయినా, తక్కు వ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాధించడం తోపాటు అక్కడే స్థిరపడే లక్ష్యంతో యువత విదే శాలను ఎంచుకుంటోంది.

బ్యాంకు లోన్లు తీసుకుని..

పడిపోతున్న రూపాయి విలువ, తగ్గిపోతున్న ఉపాధి అవకాశాలు, ఉద్యోగం లభించేందుకు కాలయాపన... వీటన్నింటికి మించిన భటుంబ ఆర్థిక పరిస్థితులు యువత విదేశాలకు వెళ్లడానికి కారణాలుగా కని పిస్తున్నాయి. ఎంతో కష్టపడి చదివించిన తల్లితండ్రు లకు తాము భారం కాకూడదనకుంటున్నారు. చాలా మంది యువత తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుప ర్చుకునేందుకు విదేశాలకు వెళ్లేందుకు సిద్ధపడుతు న్నారు. అందుకోసం కొంత ఆర్థిక భారమైనా సరే బ్యాంకు లోన్లు తీసుకుని మరీ విదేశాల్లో చదువుకునేందుకు పయనమవుతున్నారు. అలా పయనమ య్యే వారిలో అత్యధిక శాతం మంది మధ్యతరగతి కుటుంబాల నుంచే ఉండటం గమనార్హం. జిల్లా వ్యా ప్తంగా విదేశాల్లో డిగ్రీ చదివేందుకు వెళ్తున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. మారుమూల గ్రామా ల్లో నుంచి సైతం అమెరికా, యూకే, కెనడా, జర్మనీ, తదితర విదేశాలకు వెళ్లిన వారు ఉన్నారు.

వెళ్లడానికి కారణాలివే...

ముఖ్యంగా విదేశాల్లో ఉపాధి అవకాశాలు బాగుంటాయన్న ఆలోచన యువతలో ఉంది. ఇక్కడ చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం కోసం వేచి చూడాల్సి వస్తుందని, ఆ కారణంగా తల్లిదండ్రులపై ఆధార పడాల్సి రావడం వల్ల వారికి ఆర్థిక భారంగా మారాల్సి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి విదేశాల్లో అయితే చదువుతోపాటు ఉద్యోగం కూడా చేసుకోవచ్చుననేకారణంతో అక్కడికి వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. విదేశాల్లో వేతన సరళి కూడా గంటల చొప్పున ఉంటుందని, అక్కడ పనిచేస్తూ చదువుకోవడం ద్వారా తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడదనే భావనలో అనేక మంది ఉన్నారు. మరికొందరు విదేశీ డిగ్రీకి విలువఉందని భావించి అక్కడకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. విదేశాల్లో డిగ్రీ పూర్తిచేసిన తర్వాత ఎక్కువ మొత్తంలో ప్యాకేజీలు లభిస్తాయని, ఒకవేళ అక్కడినుంచి తిరిగి వచ్చినప్పటికీ స్వదేశంలో అత్యధిక వేతనాలతో కంపెనీలు ఆఫర్లు ఇస్తా యన్న భావన కూడా ఉంది.

సొంత నిర్ణయంతోనే.....

అత్యధిక శాతం యువత తమ సొంత నిర్ణయాలతోనే విదేశాలబాట పడుతున్నారు. ఎంత కష్టమైనా సరే.. తల్లిదండ్రులను ఒప్పించి మరీ పయనమవుతున్నారు. ఉన్నత చదువు పూర్తయిన తరువాత తిరిగి వద్దామనే ఆలోచన తక్కువ మందిలో ఉండగా, పార్ట్ జాబ్ చేసైనా అక్కడే స్థిరపడాలనే ఆలోచనలో అధికశాతం మంది ఉన్నారు. కుటుంబా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్న పిల్లల బలమైన కోరికను తీర్చేందుకు..

మిగతా 7లో

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్


నెల్కివెంకటాపూర్‌లో ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.

దండేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా పాఠశాలోని మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలను సోమవారం కలెక్టర్ సందర్శించారు. నెల్కివెం కటాపూర్ ప్రభుత్వ పాఠశాలలోని ప్రభుత్వ బీసీ వసతి గృహాన్ని ఏర్పాటు చేయడానికి ఆయన సందర్శించి అక్కడ వసతులపై ఆరాతీశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున పాఠశాలను గ్రామంలోని మరోచోట ఏర్పాటు చేసి, దండేపల్లిలో అద్దె భవనంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహ ఏర్పాటుపై అధి కారులపై చర్చిం చారు. అనంతరం అక్కడ నుంచి లింగాపూర్ ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఆదర్శ పాఠశాలోని నెలకొన్న సమస్యలు, తాగునీటి సమస్య బాగా ఉందని, దీంతో తాగునీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి ప్రిన్సిపల్ రమేష్ తీసుక వచ్చారు. మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు అందించే విధంగా చూస్తామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే విద్యార్థులను సంసిద్ధులను చేయాలని ఉపాధ్యాయులకు సూచిం చారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచి ఫలితాలు సాధించవచ్చునని ఆదిశగా విద్యార్థులు బాగా చదువు కోవాలన్నారు. అనంతరం ఆదర్శ పాఠశాలోని హాస్టల్ భవనం గురించి ఆరా తీశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఆర్ఐ బొద్దుల భూమన్న, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రమేష్, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అరకొర సిబ్బంది.. రోగుల ఇబ్బంది...

- బెల్లంపల్లి వంద పడకల ఆసుపత్రిలో వేధిస్తున్న వైద్యుల కొరత
- 30 పడకల సిబ్బందితోనే సేవలు 7
- పరికరాలు లేక.. అందని మెరుగైన వైద్యం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

- నేటి నుంచి మూడు రోజుల పాటు

గంగాపూర్ జాతర

6

అర్హత గల బాధితులకు పరిహారం

- కలెక్టర్ కుమార్ దీపక్


వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల వరంగల్ ఖ మ్మం, విజయవాడ జాతీయ రహదారి 163జీ నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన బాధితులకు పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కలె క్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన బాధితుల వివరాలను మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 163 జీ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించామన్నారు. ఆర్బిట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పరిహారం అందని అర్హత గల వారు సంబంధిత పత్రాలు, బ్యాంకు పాసు పుస్తకాలతో సంప్రదిస్తే రికా ర్డులు పరిశీలించి సరిగ్గా ఉన్నట్లు నిర్ధారణ జరిగితే నిర్దేశిత ధరల ప్రకారం పరి హారం చెల్లిస్తామన్నారు.

గాంధారిఖిలా జాతర ఘనంగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో ఈ నెల 14నుంచి 16 వరకు జరిగే గాంధారి ఖిలా మైసమ్మ జాతరను సంబంధిత శాఖల అధికారులు ఘనంగా నిర్వహించాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు అన్నారు. సోమ వారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యా లయంలో అధికారులతో సమా వేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశు ద్యం, తాగునీరు, రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలన్నారు. వైద్యసిబ్బందిని, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి తహసీల్దార్ సతీష్‌కుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్‌రెడ్డి, ఆదివాసంగాల నాయకులు, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెయిన్ బో ప్లే స్కూల్‌లో ఘనంగా స్పోర్ట్స్ డే

నస్పూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యానగర్ సీసీసీలో గల శ్రీ రెయిన్ బో ప్లే స్కూల్‌లో సోమవారం స్పోర్ట్స్ డే (క్రీడాదినోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వ హించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహు మతులను అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా హాజరైన ఎంఈవో దామోదర్‌రావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ రావులు మాట్లాడారు. చిన్నారుల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నా యన్నారు. పిల్లల క్రమశి క్షణ, క్రీడా శిక్షణావగా హనతో ప్రదర్శనలు బాగా నచ్చాయన్నారు. విద్యతోపాటు క్రీడల్లో, సాంస్కృతిక కార్యక్ర మాల్లో రాణించాలన్నారు. చిన్నారు లు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ ఎంతో దోహదం చేస్తా యన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చెన్నూరి మానస, కరస్పాండెంట్ చెన్నూరి ఆమన్ ప్రసాద్, రామగుండం ఎస్సై రవి కుమార్, ప్రిన్సిపల్ రజనీలతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో దామోదర్ రావు, పాఠశాల కరస్పాడెంట్స్

విద్యుత్ లైన్ పనులను అడ్డుకున్న రైతులు


రైతులు, విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్సై సతీష్

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం జెండవెంకటాపూర్ గ్రామ సబ్ స్టేషన్ నుంచి వెంకట్రావుపేట సబ్ స్టేషన్ వరకు చేపట్టనున్న 33కేవీ విద్యుత్ లైన్ పనులను జెండవెంకటాపూర్ రైతులు సోమవారం అడ్డుకున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో దానికి సంబంధించి కరెంటు స్తంభాలను కూడా వేశారు కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు స్తంభాల నుంచి విద్యుత్ వైర్లు వేయడంలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు అధికారులు సోమవారం స్తంభాల నుంచి వైర్లు వేసేందుకు జెండవెంకటాపూర్ గ్రామానికి వెళ్లంతో గ్రామ రైతులు పనులను అడ్డుకున్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలు పొట్ట దశలో ఉన్నాయని వైర్లు అమర్చే సమయంలో పంటలు దెబ్బతింటాయని 45 రోజులు గడిస్తే పంటలు కోసుకుంటామని పంటలను కోసిన తర్వాత పనులు చేపట్టాలని డిమాండ్ చేసారు. పనులు చేపడితే ఊరుకునేది లేదంటూ పనులను అడ్డుకున్నారు. రానున్నది వేసవికాలం పనులు చేపట్టకపోతే రైతులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని అధికారులు ఎంత చెప్పిన రైతులు ససేమిరా అన్నారు. రైతులు ఎంతకూ వినకపోవడంతో విద్యుత్ శాఖ ఏఈ గణేష్ పోలీసులకు సమాచారం అందించారు. లక్షెట్టిపేట ఎస్సై సతీష్ సిబ్బందితో గ్రామానికి వచ్చి రైతులతో మాట్లాడి ఆందోళనకారులకు నచ్చజెప్పి సముదాయించారు.

రైతులు సాగు చేసే పంటలకు ఏలాంటి నష్టం జరుగకుండా పనులు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను, సిబ్బందిని ఆదేశించడంతో ఎట్టకేలకు 33కేవి పనులు సజావుగా పూర్తి చేశారు విద్యుత్ అధికారులు సిబ్బంది.

ఫోన్ కాల్‌తో అందుబాటులోకి సైబర్ వారియర్

- రామగుండం సీపీ శ్రీనివాస్


శిక్షణ కార్యక్రమంలో రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : అనుకోని రీతితో సైబర్ నేరానికి గురైనప్పుడు కంగారుపడకుండా ఒక్క ఫోన్‌కాల్ (1930)చేస్తే చాలు. సైబర్ వారియర్స్ ఫోన్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తుందని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం సైబర్ నేరాల కట్టడిపై కమిషనరేట్ కార్యాలయంలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోకుండా సైబర్ నేరానికి గురైనప్పుడు కంగారుపడకుండా 1930కు ఫోన్ చేస్తే నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పి) నేరాన్ని నిరోధించడం, అనుమానిత ఐడెంటిఫైలను విశ్లేషించడం, అలాగే సోషల్ మీడియా, ఆన్‌లైన్ మోసాలపై దర్యాప్తు చేయడం వంటి వాటిపై వారికి శిక్షణ కల్పిస్తామని తెలిపారు. పోలీస్‌స్టేషన్ టీఎస్సీఎస్‌బీ మధ్య సైబర్‌వారియర్స్ సమన్వయకర్తలుగా పని చేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేందర్‌రావు, సైబర్ క్రైం ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది, పాల్గొన్నారు.

గూడెంలో పంచసూక్త హోమయజ్ఞము..

- సత్యదేవుడికి భక్తిశ్రద్ధలతో భక్తుల ప్రత్యేక పూజలు

దండేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవాలయంలో మాఘమాస స్వామివారి బ్రహోత్సవాలో భాగంగా సోమవారం స్వామి వారికి వైభవంగా స్థాళీపాక పంచసూక్త హోమ యజ్ఞాము ప్రత్యేక పూజలను నిర్వహించారు. యగజ్ఞచార్యులు అభిరామచార్యులు ఆధ్వర్యంలో ఆలయ వ్యవస్థాన కుటుంబ సభ్యులు రఘుస్వామి, సంపత్‌స్వామి, స్వామివారికి నిత్యవిధి, ప్రబోదిక ఆరగింపు, తీర్థ ప్రసాదాల గోష్టి, హవనము, బలిహరణము, సాయంత్రం హోమము, బలిహరణాల ప్రత్యేక పూజ కార్యక్రమాలను వేద మంత్రోచ్చరణల మధ్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. సప్తహభజన మండపంలో నిరంతరం సప్తహ భజన కార్యక్రమంను భజనపరులు ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఘనంగా గట్టు మల్లన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠ

జైపూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేలాల గ్రామంలోని గట్టు మల్లన్న స్వామి పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవోపేతంగా సోమవారం నిర్వహించారు. పురోహితుడు రామడుగు రాముశర్మ ఆధ్వర్యంలో స్వామివారి పిండం (లింగం) పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం హోమం, అష్ట బంధన సహిత మహాకుంభాభిషేకం, నంది విగ్రహం ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో రమేష్ పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణకు కృషి చేయాలి


చెక్‌పోస్టును పరిశీలిస్తున్న రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ ఏలుసింగ్‌మేరు

చెన్నూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ ఏలుసింగ్‌మేరు అన్నారు. సోమవారం మండలంలోని కిష్టంపేట వై జంక్షన్, కోటపల్లి మండలం పారుపెల్లి చింతచెట్టు జాతీయ రహదారి 63పై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల నిర్వహణ, దాని ప్రాధాన్యత, జాగ్రత్తలు తదితర అంశాలపై సంబంధిత అధికారులకు వివరించారు. కార్యక్ర మంలో కవ్వాల టైగర్ రిజర్వు ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం, మంచిర్యాల డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్, చెన్నూరు ఫారెస్టు డివిజన్ అధికారి సర్వేశ్వర్, రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు సులభతరం

గర్మిళ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ సేవలందించడంలో భాగంగా కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు మరింత సులభతరం చేశామని మంచిర్యాల విద్యుత్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారునికి కొత్త సర్వీసుల మంజూరులో ఏదైనా కారణం చేత దరఖాస్తును తిరస్కరించకుండా మరో అవకాశం కల్పిస్తున్నామన్నారు. మరింత సమాచారం తెలుసుకోవడానికి 1912కి ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు.

మంత్రిని కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి జనక్ ప్రసాద్ నేతృత్వంలో సోమవారం కరీంనగర్‌లో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జనక్ ప్రసాద్ కార్మికుల సొంతింటి కళ నెరవేర్చే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అంతే కాకుండా ప్రతి నెల కార్మికుల వేతనాల నుంచి ఇన్కమ్ టాక్సు పేరిట కోత విధిస్తున్నారని, ఈ విషయంపై కూడా సీఎంతో కూడా దీని రద్దు కోసం మాట్లాడాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కాంపెల్లి సమ్మయ్య, ఏనుగు రవిందర్‌రెడ్డి, దరంపురి పాల్గొన్నారు.